



sahanamvande.com

# సహనం వందే

epaper.sahanamvande.com


హైదరాబాద్ | 20-11-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 199 EDITOR: ROHINI


# విజయ్ వేటు... బాబు చోటు

## డేటా లీక్... ఆంధ్ర, తమిళ్ చిచ్చు!





- గైడెన్స్ సంస్థలో లీకుల కలకలం
- ఇన్వెస్టర్ల డేటా ఏపీకి చేరిందా?
- 15 మందిపై వేటు... ముగ్గురు ఏపీలో
- టీడీపీ ఖండన... రాజా నిప్పులు
- రాజకీయ క్రీడలో పాలనా వ్యవస్థ

**దక్షిణాదిలో పారిశ్రామిక పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాల మధ్య నడిచే ఆరోగ్యకరమైన పోటీ కాస్తా ఇప్పుడు పరస్పర అనుమానాలు, రాజకీయ చిచ్చుగా మారింది. తమిళనాడుకు రావాల్సిన భారీ పెట్టుబడుల సమాచారం ఆంధ్రప్రదేశ్‌కు లీక్ అయిందన్న వార్తలు రెండు రాష్ట్రాల మధ్య కొత్త వివాదానికి ఆజ్యం పోశాయి. తమిళనాడు ప్రభుత్వ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ 'గైడెన్స్ తమిళనాడు'కు చెందిన 15 మంది అధికారులను తొలగించడం, అందులో ముగ్గురు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుండటం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది.**

**- సహనం వందే, అమరావతి/తమిళనాడు**

'గైడెన్స్ తమిళనాడు' అనేది తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఒక నోడల్ ఏజెన్సీ. విదేశీ, స్వదేశీ కంపెనీలను తమిళనాడులో పరిశ్రమలు పెట్టేలా ఆకర్షించడం, వారికి అవసరమైన అనుమతులు ఇప్పించడం దీని ప్రధాన పని. ఏ కంపెనీ ఎంత పెట్టుబడి పెట్టబోతోంది, ఎక్కడ భూములు అడుగుతోంది, ప్రభుత్వం వారికి ఎలాంటి రాయితీలు ఇవ్వబోతోంది అనే అత్యంత రహస్యమైన 'ఇన్వెస్ట్‌మెంట్ డేటా' ఈ సంస్థ అధికారుల దగ్గరే ఉంటుంది. ఒక రాష్ట్రం ఆఫర్ చేస్తున్న రాయితీల వివరాలు పక్క రాష్ట్రానికి తెలిస్తే, ఆ పక్క రాష్ట్రం అంతకంటే మెరుగైన ఆఫర్ ఇచ్చి ఆ కంపెనీని తనవైపు తిప్పుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు సరిగ్గా ఇదే జరిగిందన్నది ప్రధాన ఆరోపణ. తమిళనాడుకు రావాల్సిన కంపెనీల రహస్య సమాచారాన్ని ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు చేరవేశారన్న అనుమానంతోనే ప్రభుత్వం వారిపై వేటు వేసినట్లు ప్రచారం జరుగుతోంది.

### ఏపీ ప్రభుత్వంలో చేరడం వెనుక మతలబేంటి?

గైడెన్స్ తమిళనాడులో కీలక విభాగాల్లో పనిచేస్తున్న 15 మంది అధికారులు, కన్సల్టెంట్లను ఈ డేటా లీక్ అనుమానంతో తొలగించారు. అయితే అసలు ట్విస్ట్ ఏంటంటే, అలా తొలగించిన వారిలో ముగ్గురు అధికారులు నేరుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో చేరి పనిచేస్తుండటం.

ఒక రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడుల విభాగంలో పనిచేసి, డేటా లీక్ ఆరోపణలతో బయటకు వచ్చిన వ్యక్తులు, సరిగ్గా అదే రంగంలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం సాధారణ విషయంగా కనిపించడం లేదు. ఇది కేవలం యాదృచ్ఛికమా, లేక ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం డేటాతో సహా వారు ఏపీకి షిఫ్ట్ అయ్యారా అన్న అనుమానాలు తమిళనాడు వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమైంది.

### టీడీపీ ఖండన... డీఎంకే విమర్శల దాడి

ఈ ఆరోపణలు తమ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేవిగా ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని అధికార టీడీపీ వెంటనే స్పందించింది. తమిళనాడు నుంచి ఎలాంటి డేటా లీక్ జరగలేదని, ఆ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని టీడీపీ తేల్చి చెప్పింది. పెట్టుబడుల ఆకర్షణలో తమ విధానాల వల్లే కంపెనీలు వస్తున్నాయి తప్ప, దొంగదారిలో డేటా సేకరించాల్సిన అవసరం తమకు లేదన్న ధోరణిలో టీడీపీ ఈ వార్తలను కొట్టిపారేసింది. మరోవైపు తమిళనాడులో డీఎంకే మాజీ మంత్రి రాజా ఈ వ్యవహారాన్ని అస్త్రంగా మార్చుకున్నారు. ఈ మొత్తం డేటా లీక్ ఎపిసోడ్‌ను విజయ్ ప్రభుత్వం అత్యంత పేలవంగా హ్యాండిల్ చేసిందని ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.

### అన్నాడీఎంకే నుంచి విజయ్ వరకు...

ఈ వివాదంలో అత్యంత విమర్శనాత్మకమైన అంశం ఏమిటంటే, మూడు ప్రధాన రాజకీయ పక్షాలు ఈ వ్యవహారంలో ఇరుక్కుపోయి ఉండటం. ఈ 15 మంది అధికారులను మొదట నియమించింది అన్నాడీఎంకే ప్రభుత్వం. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఎలాంటి తనిఖీలు లేకుండా వారిని కీలక స్థానాల్లో కొనసాగించింది. చివరికి ఇప్పుడు విజయ్ ప్రభుత్వం వారిపై డేటా లీక్ అనుమానంతో వేటు వేసింది.

నియామకం చేసిన అన్నాడీఎంకే, ఏళ్ల తరబడి కొనసాగించిన డీఎంకే, ఇప్పుడు ఆధారాలు బయటపెట్టకుండానే తొలగించిన విజయ్ ప్రభుత్వం.. ఇలా ఎవరికి వారు తమ తప్పు లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడానికే ఈ అంశాన్ని వాడుకుంటున్నాయి తప్ప, అసలు ఆ రహస్య డేటా ఏపీకి ఎలా వెళ్లింది, దానివల్ల తమిళనాడుకు ఎంత నష్టం జరిగింది అనే విషయాలను మాత్రం ఎవరూ బయటపెట్టడం లేదు.

## అమెరికా నుంచి ఆకాశంలో ఒక తార

### వెండితెరకు ఇంజనీర్ సాత్విక వీరవల్లి

**అమెరికాలోని చికాగోలో పుట్టి పెరిగిన సాత్విక వీరవల్లికి చిన్నప్పటి నుంచి సినిమాల్లో నటించాలనే ఆలోచన లేదు. కృష్ణా జిల్లా వీరవల్లి గ్రామంలో కుటుంబ మూలాలున్న ఆమె తండ్రి, చదువుల కోసం తొలుత హైదరాబాద్‌కు వచ్చి తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు. ఇంట్లో తెలుగు, తమిళ సంప్రదాయాల వాతావరణం ఉండగా, తమిళ సంస్కృతిపై ఆమెకు ఎక్కువ ఆసక్తి ఉండేది. గత రెండేళ్లుగా తెలుగు భాష నేర్చుకుంటున్న సాత్విక, ఉన్నత చదువులు పూర్తి చేసి ఐటీ ఉద్యోగంలో చేరారు. దుల్కర్ సల్మాన్, శ్రుతి హాసన్, రుహానీ శర్మలతో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటించారు.**

**- సహనం వందే, హైదరాబాద్**

- అమెరికాలో విద్యాభ్యాసం, ఉద్యోగం
- కృష్ణా జిల్లా మూలాలు... అనుకోకుండా హీరోయిన్
- ఒక్క వీడియోతో సినిమా అవకాశం
- దుల్కర్ సల్మాన్ నటన సూచనలు
- సుకుమార్ సినిమాలో ఛాన్స్ ప్రచారం



సోషల్ మీడియాలో సాత్విక వీరవల్లి పెట్టిన ఓ వీడియో 'కాంతా' నిర్మాతల్లో ఒకరిని ఆకర్షించి ఆడిషన్‌కు దారితీసింది. అందులో ఎంపిక కాకపోయినా, ఆ వీడియో చూసిన దర్శకుడు పవన్ సాదినేని 'ఆకాశంలో ఒక తార' కోసం అవకాశం ఇచ్చారు. డిసెంబర్ 2024లో ఐటీ ఉద్యోగానికి రాజీనామా చేసి సినిమాలపై దృష్టి పెట్టారు. షెడ్యూళ్ల మధ్య సహనటులు ఇతర చిత్రాలతో బిజీ అయినా, తొందరపడకుండా సహనంతో ఎదురుచూశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ప్రేక్షకులకు పరిచయమయ్యారు.

### చదువుతో పాటు కళాభిరుచి

నాష్‌విల్లేలోని వాండర్‌బిల్ట్ విశ్వవిద్యాలయంలో ఇంజినీ రింగ్ మేనేజ్‌మెంట్ మాస్టర్స్ పూర్తి చేసిన సాత్విక, పీహెచ్‌డీ లేదా ఎంబీఏ ఆలోచనలో ఉండేవారు. ఉద్యోగం, చదువు మధ్య సృజనాత్మకతకు అవకాశం తక్కువని భావించిన ఆమె, న్యూయార్క్‌లో ఉద్యోగం చేస్తూనే కళారంగంలో ఉన్నవారిని చూసి ప్రేరణ పొందారు. చికాగోలో తల్లి వద్ద భరతనాట్యం, కర్ణాటక సంగీతం నేర్చుకోవడం, ముఖ్యంగా నృత్యంపై ఆసక్తి కళాభిరుచిని పెంచాయి.

### దుల్కర్ సల్మాన్ నటన పాఠాలు

నటనలో అనుభవం లేని సాత్వికకు చిత్రబృందం సంభాషణలు, భావ వ్యక్తీకరణపై శిక్షణ ఇచ్చింది. చుట్టూ ఉన్నవారి ప్రవర్తన, హావభావాలను గమనించాలని, ఫలితాలతో సంబంధం లేకుండా ఎంచుకున్న సినిమాకు కట్టుబడి ఉండాలని దుల్కర్ సల్మాన్ సూచించారు. పాశ్చాత్య సంస్కృతిలో గొంతు, వేగంతో భావాలు చూపిస్తే, తూర్పు దేశాల్లో ముఖ కవళికలు, చేతులు, శరీర కదలికలతో వ్యక్తపరుస్తారని ఆమె గ్రహించారు. ఈ తేడాలను అర్థం చేసుకుని పాత్ర మనస్తత్వానికి తగ్గట్టుగా నటించడాన్ని సవాలుగా తీసుకున్నారు.

### కల్పన పాత్ర, కొత్త అవకాశాలు

'ఆకాశంలో ఒక తార'లో వ్యోమగామి కావాలనే కల ఉన్న చిన్న పట్టణపు యువతి కల్పన పాత్రలో సాత్విక కనిపించనున్నారు. దర్శకుడు సుకుమార్, రామ్ చరణ్ చిత్రంలో ఆమెకు ఛాన్స్ రావచ్చని ప్రచారం జరుగుతోంది. కొన్ని నిర్మాణ సంస్థలతో చర్చలు సాగుతున్నాయని, కొన్ని వార్తలు ప్రచారమే అయినా మరికొన్ని ప్రాజెక్టులు ఖరారయ్యాయని ఆమె తెలిపారు. పెద్ద ప్రణాళికలు లేకుండా నచ్చిన నిర్ణయాలు తీసుకుంటూ సహనంతో ముందుకు సాగుతున్నారు.

## వీడియో గేమ్... మోడీ వెల్ కమ్

### గేమింగ్ ప్రపంచాన్ని ఊపేస్తున్న జీటీఏ 6

**ఒక వీడియో గేమ్ కోసం ఉద్యోగానికి సెలవు పెట్టడం ఎప్పుడైనా చూశారా? ఒక గేమ్ ఆడటానికి గంటకు రూ.250 చెల్లించి గేమింగ్ కేఫ్‌లకు పరుగులు తీయడం చూశారా? అంతేకాదు.. ఇంకా విడుదల కాకముందే కోట్ల మంది డబ్బులు చెల్లించేంత క్రేజ్ ఉంటే? వినడానికి ఆశ్చర్యంగా ఉంది కదా! ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఇదే జరుగుతోంది. గ్రాండ్ తెఫ్ట్ ఆటో సిక్స్ (జీటీఏ 6) దాదాపు 13 ఏళ్ల నిరీక్షణ తర్వాత విడుదల కావడంతో గేమింగ్ ప్రపంచంలో పండగ వాతావరణం నెలకొంది. భారత్‌లోనూ గేమింగ్ కేంద్రాలు అభిమానులతో కిటకిటలాడుతున్నాయి. ప్రముఖ యూట్యూబర్లు గంటల తరబడి ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నారు. చివరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం ఈ సందడిలో భాగమయ్యారు.**

**- సహనం వందే, హైదరాబాద్**

- ఉద్యోగాలకు సెలవులు పెట్టి ఆడుతున్న అభిమానులు
- గేమింగ్ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక విధ్వంసం
- ముందస్తు డిజిటల్ కొనుగోళ్ల అంచనా రూ. 15 వేల కోట్లు
- దీని విడుదలతో ప్రపంచవ్యాప్తంగా పండగ వాతావరణం
- గేమ్ తయారీలో భారతదేశానికి కూడా భాగస్వామ్యం
- 13 ఏళ్ల నిరీక్షణకు తెర... అసలు కథ ఏంటంటే...?






**2013** సెప్టెంబరులో జీటీ ఏ 5 వచ్చిన తర్వాత కొత్త భాగం కోసం కోట్లాది మంది అభిమానులు ఎదురుచూశారు. ఎట్టకేలకు ఈ నెల 19న (గురువారం) జీటీఏ 6 విడుదలైంది. ఇది సినిమా కాదు, ఓటీటీ సిరీస్ కాదు.. మనమే పాత్రను నడిపించే వీడియో గేమ్. నగరంలో తిరగడం, కార్లు, బైకులు నడపడం, పనులు పూర్తి చేయడం, పోలీసుల నుంచి తప్పించుకోవడం, నేర ప్రపంచంలోని వ్యక్తులను ఎదుర్కోవడం ఇందులో ఉంటాయి. జేసన్, లూసియా అనే పాత్రలు ఒక టోపిడీ ప్రయత్నంతో మొదలై నేర కుట్రలో చిక్కుకుంటారు. అమెరికాలోని ఫ్లోరిడాను పోలిన లియోనిడా, అందులో వైస్ సిటీ నేపథ్యంగా ఈ కథ సాగుతుంది.

### ఉద్యోగాలకు సెలవులు.. గేమింగ్ కేఫ్‌లకు క్యూ

గేమ్ విడుదలైన గురువారం ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ సందడి కనిపించింది. కొందరు ఉద్యోగాలకు సెలవులు పెట్టారు. మరికొందరు రాత్రంతా మేల్కొని ఎదురుచూశారు. అమెరికాలో కొన్ని సంస్థలు ప్రత్యేక గేమింగ్ సెలవులు కూడా ప్రకటించాయి. రాయిటర్స్ కథనం ప్రకారం ఢిల్లీ,బెంగళూరు,శ్రీనగర్‌లలో గేమింగ్ కేంద్రాలకు అభిమానులు వచ్చారు. బెంగళూరుకు చెందిన జాకబ్ జోయెల్ అనే ఐటీ ఉద్యోగి సెలవు పెట్టి కేఫ్‌లో పెద్ద తెరపై ఆడారు. దేశంలో సుమారు 55 కోట్ల మంది వీడియో గేమ్‌లు ఆడుతున్నా, చాలామంది మొబైల్‌లో ఆడతారు. జీటీఏ 6 ప్రత్యేక పరికరాల్లోనే ఉండటంతో కేఫ్‌లకు డిమాండ్ పెరిగింది. కొన్నిచోట్ల ఆదివారం వరకు ముందస్తు బుకింగ్‌లు జరిగాయి.

### మోడీ స్పందన.. రూ. 15 వేల కోట్ల అంచనా

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా జీటీఏ స్ఫూర్తితో రూపొందించిన చిత్రాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 2013లో జీటీఏ 5 వచ్చినప్పటి భారత్‌కు, 2026లో జీటీఏ 6 వచ్చినప్పటి భారత్‌కు మధ్య మార్పులను పోలుస్తూ, భారత్ ఇప్పుడు సరికొత్త ఆట ఆడుతోందని వ్యాఖ్యానించారు. వ్యాపార లెక్కల విషయానికి వస్తే, విడుదలకు ముందే దాదాపు 1.7 కోట్ల డిజిటల్ ముందస్తు కొనుగోళ్లు జరిగినట్లు సెన్సార్ టవర్ అంచనా వేసింది. వీటి విలువ సుమారు దాదాపు రూ.15 వేల కోట్లు. ఇందులో ప్లేస్టేషన్ వాటా సుమారు 75 శాతం, ఎక్స్‌బాక్స్ వాటా 25 శాతంగా నివేదికలు తెలిపాయి.

### ఎక్కడ ఆడొచ్చు.. ధరలు, జాగ్రత్తలు

ప్రస్తుతం ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్, ఎస్ పరికరాల్లో ఈ గేమ్ అందుబాటులో ఉంది. ప్లేస్టేషన్ 4లో ఆడలేరు, కంప్యూటర్లకు ఇంకా అధికారిక విడుదల తేదీ ప్రకటించలేదు. ప్లేస్టేషన్ డిజిటల్ స్టోర్ ప్రకారం సాధారణ ఎడిషన్ ధర రూ.5,999, అల్టిమేట్ ఎడిషన్ ధర రూ.7,499. డౌన్‌లోడ్‌కు ఇంటర్నెట్ అవసరం కానీ, ప్లేస్టేషన్ సమాచారం ప్రకారం ప్రధాన ఆటను ఆఫ్‌లైన్‌లోనూ ఆడొచ్చు. హింసాత్మక దృశ్యాలు, మాదకద్రవ్యాల ప్రస్తావనలు, నగ్నత్వం, లైంగిక అంశాలు వంటి హెచ్చరికలు ఉన్నందున పెద్దలకే అనువైనది.